నమస్తే తెలంగాణ

నిజామాబాద్

5 నిజామాబాద్, శనివారం 20 ఏప్రిల్ 2024 NIZAMABAD

# ఎల్లారెడ్డి ఎమ్మెల్యేకు చేదు అనుభవం

**రామనవమి వేడుకల్లో రాజకీయాలు వద్దన్న జనం**


స్టేజీపైకి ఎక్కిన ఎమ్మెల్యేను వారిస్తున్న గ్రామస్తులు

గాంధారి, ఏప్రిల్ 19: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు చేదు అనుభవం ఎదురైంది. గాంధారి మండలంలోని గౌరారం గ్రామంలో శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి రథోత్సవంతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సేజీపైకి వెళ్లగా.. గ్రామస్తులు అడ్డుకున్నారు. స్టేజీ దిగి వెళ్లిపోవాలని కోరారు. అందరూ కలిసి జరుపుకొనే పండుగలో రాజకీయాలు వద్దంటూ వారించారు. దీంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన వీడియోలు వైరల్ కావడంతో మండలంలోని అన్ని వాట్సాప్ గూపుల్లో చక్కర్లు కొట్టడం గమనార్హం.

# రెండో రోజు ఏడు నామినేషన్లు..


రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బాజిరెడ్డి

కంఠేశ్వర్, ఏప్రిల్ 19: లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. రెండో రోజైన శుక్రవారం ఏడు నామినేషన్లు దాఖలైనట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన ఆరుగురు అభ్యర్థులు ఏడు నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్ వేయగా.. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్, బహుజన ముక్తిపార్టీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థులుగా రాపెల్లి శ్రీనివాస్ , రాగి అనిల్, ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెలా సుమన్ నామినేషన్ పత్రాలను సమర్పించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు పేర్కొన్నారు


అభివాదం చేస్తున్న మహమూద్ అలీ, గంగుల, వేముల, శ్రీనివాస్‌గౌడ్, బాజిరెడ్డి, సురేశ్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బిగాల, వీజీగౌడ్, విద్యాసాగర్‌రావు, సంజయ్, ఎల్ రమణ, డాక్టర్ సంజయ్

**నిజామాబాద్** లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం పాత కలెక్టరేట్ మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభలో మాజీ మంత్రులు మహమూద్ అలీ, గంగుల కమలాకర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి, కోరుట్ల, జగిత్యాల ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు బిగాల గణేశ్‌గుప్తా, ఆశన్నగారి జీవన్ రెడ్డి, విద్యాసాగర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్ వసంత తదితరులు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

# బీజేపీ, కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

- రేవంత్, మోదీ ఇద్దరూ ఒక్కటే
- బాండ్ పేపర్‌తో మోసం చేసిన ఘనుడు అర్వింద్
- బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి
- కాంగ్రెస్.. దొంగల పార్టీ
- వందరోజుల్లో ప్రజలను కష్టాల్లోకి నెట్టిన రేవంత్ సర్కార్
- మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ
- మాజీ మంత్రి మహమూద్ అలీ ఆగ్రహం



ఖలీల్‌వాడి, ఏప్రిల్ 19: సీఎం రేవంత్ రెడ్డి, ప్రధాని మోదీ ఇద్దరూ ఒక్కటేనని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందరోజుల్లో నెరవేరుస్తామని చెప్పి ప్రజల ఆశలను అడియాశలు చేసిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటేనని, హస్తం పార్టీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డిని నిలబెట్టి అర్వింద్‌ను గెలిపించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆ పార్టీల నిజస్వరూపం గమనించాలని ప్రజలకు సూచించారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్ వంద రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని చెప్పి రైతులను మోసం చేశాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. బాండ్ పేపర్ రాసి వంచించిన ఘనుడు అర్వింద్ అని విమర్శించారు. ఐదేండ్లు దాటినా పసుపు బోర్డు జాడలేదన్నారు. పసుపు రైతులను తీసుకెళ్లి నామినేషన్ వేస్తానని డ్రామాలు చేశాడన్నారు. కాంగ్రెస్, బీజేపీలను బొందపెట్టి, బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఫైటర్ బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆశీర్వదించాలని వేముల కోరారు


సభకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

## రేవంత్‌రెడ్డి ఝూటా కోర్..



**-బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్**

రేవంత్‌రెడ్డి ఝూటాకోర్ అని, కాంగ్రెస్, బీజేపీ నాయకులు అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకోవాలని చూస్తున్నారని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌ను మరోసారి నమ్మితే చెవిలో కమలం పువ్వు, నెత్తిన చెయ్యిపెట్టి నిండా ముంచుతారని అన్నారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చిన పసుపు బోర్డు ఎటు పోయిందని ప్రశ్నించారు. పొద్దున లేస్తే ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, హిందూ, ముస్లిం వ్యాఖ్యలతో ప్రజలను రెచ్చగొట్టడమే తప్ప ప్రజలకు చేసింది శూన్యమని అన్నారు. మోదీ.. పేదలకు పంచుతానన్న నల్లధనం ఎటుపోయిందని ప్రశ్నించారు. ఒకే కుటుంబంలో తండ్రీ కొడుకులు ఎంపీలుగా పనిచేసి జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. అందుకే అర్వింద్ గ్రామాల్లో తిరిగినప్పుడు ప్రజలు తిరగబడి తరిమికొట్టారని గుర్తుచేశారు. జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఏనాడైనా జిల్లాకు వచ్చాడా అని బాజిరెడ్డి ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఝూటాకోర్ అని, దొంగ హామీలిచ్చి గద్దెనెక్కారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చినవెంటనే రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి.. 135 రోజులు గడుస్తున్నా అమలు చేయలేదని, పంద్రాగస్టు వరకు మాఫీ చేస్తామని మళ్లీ అబద్ధాలు చెబుతున్నాడని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత మాటలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తనను 40 ఏండ్లుగా ప్రజలు ఆదరిస్తున్నారని, అందుకే రాజకీయాల్లో ఉంటూ సేవచేస్తున్నానని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.



## ప్రజలను కష్టాల్లోకి నెట్టిన కాంగ్రెస్

**-మాజీ మంత్రి మహమూద్ అలీ**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలను కష్టాల్లోకి నెట్టేలా మార్పు తీసుకొచ్చిందని మాజీ మంత్రి మహమూద్ అలీ ఎద్దేవా చేశారు. పొరపాటున బీఆర్‌ఎస్‌ను ఓడగొట్టుకున్నామని రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ..ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం తప్ప చేసిందేమీలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే దొంగల పార్టీ అని, ఆ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నదని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరెంట్ పోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంటు ఎందుకు పోతున్నదని ఆయన ప్రశ్నించారు. సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే తత్వమున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## బాజిరెడ్డి గెలుస్తుండు..

**-మాజీ మంత్రి గంగుల కమలాకర్**

బాజిరెడ్డి గోవర్ధన్ గెలవడం ఖాయమని, అందుకే ఆయనకు మద్దతుగా ప్రచారం చేసేందుకు తామందరం వచ్చామని మాజీ మంత్రి గంగుల అన్నారు. బాజిరెడ్డిని ఎమ్మెల్యేగా ఎందుకు గెలిపించలేదని ప్రజలను అడిగితే.. ఎంపీగా గెలిపించుకుంటామని అనడం సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చిన్న సమస్య కూడా తలెత్తలేదని గుర్తుచేశారు. రైతులకు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేక దళారులకు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు.





## కరెంటు అప్పుడెట్ల ఉన్నది.. ఇప్పుడెందుకు పోతున్నది?

**-మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్**

కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు అంతరాయం లేకుండా వచ్చిన కరెంటు ఇప్పుడెందుకు పోతున్నదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ వంద రోజుల్లోనే ఎలాంటి మార్పు వచ్చిందో ప్రజలు తెలుసుకున్నారని అన్నారు. తాగునీటి కోసం మళ్లీ బిందెలు పట్టుకొని తిరగాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కరెంటు, సాగునీరు లేక రైతులు గోస పడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులను రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుందన్నారు.

## పసుపు బోర్డు ఎప్పుడో ఎవ్వరికీ తెలియదు

**-రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి**

ప్రధాని మోదీ ప్రకటించిన పసుపు బోర్డు ఎప్పుడు ప్రారంభమయ్యేతేదీ ఎవ్వరికీ తెలియదని రాజ్యసభ సభ్యుడు సురేశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బోర్డు తెస్తానని ఐదేండ్లపాటు రైతులను మోసం చేసిన అర్వింద్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. బాజిరెడ్డిని గెలిపిస్తే కొట్లాడి పసుపు బోర్డును తీసుకువస్తారని తెలిపారు. కాంగ్రెస్‌ను నమ్మిన ప్రజలు నేడు కరువుతో అల్లాడుతున్నారని అన్నారు.



# గ్రోమోర్ దుకాణానికి తాళం వేసిన రైతులు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 19: బీర్కూర్ మండల కేంద్రంలో విక్రయించిన నకిలీ విత్తనాలతో రైతులు మోసపోయిన విషయం తెలిసిందే. నకిలీ విత్తనాలతో సాగుచేసిన పంటలను కొన్ని రోజుల క్రితం వ్యవసాయశాఖ అధికారులు, గ్రోమోర్ కంపెనీ వారు పరిశీలించారు. రైతులతో మాట్లాడి ఈ నెల 12వ తేదీలోగా నష్ట పరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు. గడువు ముగిసి వారంరోజులు గడుస్తున్నా నష్టపరిహారం ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం గ్రోమోర్ దుకాణానికి తాళం వేసి ఆందోళన చేశారు.



గ్రోమోర్ దుకాణానికి తాళం వేసి ఆందోళన చేస్తున్న రైతులు


## ఐడీసీఎంఎస్ చైర్మన్ రాజీనామా

ఇందల్వాయి, ఏప్రిల్ 19 : మండలంలోని నల్లవెల్లి సొసైటీ చైర్మన్ పదవితోపాటు ఐడీసీఎంఎస్ చైర్మన్ పదవికి సాంబారి మోహన్ శుక్రవారం రాజీనామాచేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని డీసీవోకు అందజేశారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. నాలుగేండ్ల పదవీకాలంలో తనకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

మాచారెడ్డి మండలం ఎల్లంపేట్‌లో వడ్ల కుప్పల చుట్టూ చేరిన వర్షపు నీరు


# గాలివాన బీభత్సం


డిచ్‌పల్లి/నందిపేట్/మాచారెడ్డి/మాక్లూర్, ఏప్రిల్ 19: ఉమ్మడి జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. శుక్రవారం సాయం త్రం నుంచి రాత్రి వరకు ఉరుములు, మెరుపులతో కూడి న భారీ వడగండ్ల వాన కురిసిం ది. ఈదురు గాలులకు ఇండ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. కరెంటు స్తంభాలు, వృక్షాలు నేలకూలాయి. మామిడి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షాలతో పంటనష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డిచ్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. దీంతో ఎండబెట్టిన వడ్ల కుప్పలు తడిసిపోయాయి. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఎన్‌హెచ్-44 వద్ద ఓ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు విరిగిపడడంతో కరెంటు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇందల్వాయిలో చిన్నవాగు నుంచి తండా వరకు 50 కరెంటు స్తంభాలు నేలకొరిగాయి. మామిడి కాయలు రాలిపోయాయి. కల్లాల్లో ఎండబెట్టిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకునేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. నందిపేట్ మండలంలోనూ రాళ్లవాన కురిసింది. ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఖుద్వాన్‌పూర్ శివారులో మాదిగకుంట వద్ద మేస్తున్న పశువులపై పిడుగు పడడంతో మూడు జీవాలు మృత్యువాత పడ్డాయి. మాచారెడ్డి మండలంలో పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పం టలు నేలకొరిగాయి. ఈదురు గాలులకు సోమార్‌పేట గ్రామంలో ఓ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. ఓ మామిడి చెట్టు విరిగి ట్రాక్టర్‌పై పడడంతో వాహనం ధ్వంసమైంది. మాక్లూర్ మండలం ధర్మోరా గ్రామంలో పిడుగు పాటుకు నలుగురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన సుంకరి నారాయణ, సుంకరి శివ, సుంకరి బన్నీ, చాకలి శంకర్ వడ్లను కుప్పలుగా చేస్తుండగా పిడుగుపాటుకు గాయాలయ్యాయని తెలిపారు. వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని దవాఖానకు తరలించారు.


ఇందల్వాయిలో నేలరాలిన మామిడి

కలెక్టరేట్ వద్ద కూలిపోయిన మీడియా పాయింట్



ఇందల్వాయిలో కూలిపోయిన విద్యుత్ స్తంభం


నందిపేట్ మండలం ఖుద్వాన్‌పూర్‌లో పిడుగుపాటుకు మృతి చెందిన పశువులు


మాచారెడ్డి మండలం సోమార్‌పేట్‌లో ఎగిరిపోయిన ఓ ఇంటిపైకప్పు

# సుదర్శన్ రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకో..

**-ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి**



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

కంఠేశ్వర్, ఏప్రిల్ 19: బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని, తరిమికొట్టే రోజులు ముందున్నాయని జాగ్రత్త అంటూ అర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన మీడియా పాయింట్ వద్ద మాట్లాడారు. 420 కాంగ్రెస్ అని, ఆ పార్టీతోనే రాష్ట్రంలో కరువు వచ్చిందన్నారు. ఎప్పటికైనా రేవంత్‌రెడ్డి యూటర్న్ సీఎం అని విమర్శించారు. రైతుబంధు రూ. 15వేలు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం..రూ. 2లక్షల రుణమాఫీ ఎలా చేస్తుందని ప్రశ్నించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే షకీల్‌పై తప్పుడు కేసులు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సుదర్శన్‌రెడ్డికి కూడా పిల్లలు ఉన్నారని, జాగ్రత్త అంటూ హెచ్చరించారు. చీప్‌లిక్కర్ అమ్ముకునే సుదర్శన్‌రెడ్డి ఆటలు ఇక సాగవన్నారు. కేసీఆర్ సర్కార్ లక్షా 56 వేల కిలో మీటర్ల పైపులైన్ ఏర్పాటు చేస్తే నీళ్లు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. నిజామాబాద్ గడ్డ నుంచి ఉద్యమం మొదలైందని, వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తంచేశారు. ఎంపీ అర్వింద్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అక్కడ మోదీ ఇజం.. ఇక్కడ రౌడీయిజం చేస్తున్నారని విమర్శించారు.